సాక్షి విశాఖపట్నం

శనివారం, 6, మే, 2023



తహసీల్దార్ కార్యాలయాల్లో..

జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున తెలిపారు. IIలో



ఆనందమానందమాయె..

పాదయాత్రలో వైఎస్ జగన్ ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారు. దీంతో 1998 డీఎస్సీ ఉద్యోగులు సంబరాలు చేసుకున్నారు. IIలో



వినతుల పరిష్కారంలో..

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. IIలో

న్యూస్‌రీల్

ఉత్పత్తిలో స్టీల్‌ప్లాంట్ రికార్డు



గోదావరి బ్లాస్ట్‌ఫర్నేస్

ఉక్కునగరం(గాజువాక): నూతన ఆర్థిక సంవత్సరం మొదటి నెల ఏప్రిల్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తిలో ఉరకలు వేసింది. బ్లాస్ట్‌ఫర్నేస్–1 ఏప్రిల్‌లో 2.02 లక్షల టన్నులు హాట్ మెటల్ ఉత్పత్తి చేసి గత ఏడాది ఏప్రిల్ కంటే 14 శాతం, బ్లాస్ట్‌ఫర్నేస్–2 ఏప్రిల్‌లో 2.18 లక్షల టన్నులు హాట్ మెటల్ ఉత్పత్తి చేసి గత ఏడాది కంటే 26 శాతం వృద్ధి సాధించాయి. వెరసి రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు గత నెలలో 4.19 లక్షల టన్నులు ఉత్పత్తి చేసి గత ఏడాది ఏప్రిల్ కంటే 20 శాతం వృద్ధి సాధించాయి. స్ట్రక్చరల్ మిల్ 61 వేల టన్నులు ఉత్పత్తి చేసి గత ఏడాది కంటే 100 శాతం వృద్ధి సాధించింది. విస్తరణ యూనిట్లు వైర్ రాడ్ మిల్–2, స్పెషల్ బార్ మిల్, స్ట్రక్చరల్ మిల్‌లు 1.43 లక్షల టన్నులు ఫినిష్డ్ స్టీల్, 80 వేల టన్నులు హై ఎండ్ వాల్యూ యాడెడ్ స్టీల్ ఉత్పత్తి చేసి గత ఏడాది ఇదే వ్యవధి కంటే నూరు శాతం వృద్ధి సాధించాయి. ఈ సందర్భంగా ఉద్యోగులను సీఎండీ అతుల్ భట్ అభినందించారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

దొండపర్తి (విశాఖ దక్షిణ): టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ పాసైన 18 నుంచి 28 ఏళ్ల లోపు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు గల కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాల తెలిపారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని వెల్లడించారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఎన్ఏడీ ప్రాంతంలో బాజీ జంక్షన్‌లో గల నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో కానీ, 9502874304, 9908104113 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

జైలు సూపరింటెండెంట్‌గా కిశోర్‌కుమార్



కిశోర్‌కుమార్

ఆరిలోవ(విశాఖ తూర్పు): విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌గా ఎస్.కిశోర్‌కుమార్‌ను జైళ్ల శాఖ నియమించింది. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేసిన ఎస్.రాహుల్‌ను రాజమండ్రి కేంద్ర కారాగారానికి అటాచ్‌మెంట్‌పై బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో నెల్లూరు జైలులో ఏపీఎస్‌టీఆర్ఎస్(జైల్ సిబ్బంది శిక్షణ కేంద్రం) ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న కిశోర్‌కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు విశాఖ జైలు అధికారులు తెలిపారు. కిశోర్‌కుమార్ ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శిగా రాజు



బీఎన్ రాజు

ఉక్కునగరం: స్టీల్ ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శిగా బీ.ఎన్. రాజు నియమితులయ్యారు. ఈ మేరకు ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ శుక్రవారం నియామకపు ఉత్తర్వులు అందజేశారు. అదనపు ప్రధాన కార్యదర్శిగా రాజు యూనియన్ బలోపేతానికి కృషి చేయగలరన్న ఆశాభావం వ్యక్తం చేశారు. తనపై ఎంతో నమ్మకంతో కీలకమైన పోస్టు ఇచ్చిన జాతీయ అధ్యక్షులు జి. సంజీవరెడ్డి, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

8 నుంచి వేసవి శిక్షణ శిబిరాలు

దాబాగార్డెన్స్: జిల్లా గ్రంథాలయ సంస్థలో ఈ నెల 8 నుంచి 11 వరకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి చేతుల మీదుగా శుక్రవారం సమ్మర్ క్యాంపు పోస్టర్, కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రంథాలయాల్లో సమ్మర్ క్యాంపు నిర్వహించి పిల్లలకు సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అందుకు సంబంధించి జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ.25వేలు, గ్రేడ్–1 గ్రంథాలయానికి రూ.15వేలు, గ్రేడ్–2 గ్రంథాలయానికి రూ.12వేలు, గ్రేడ్–3 గ్రంథాలయానికి రూ.10వేలు చొప్పున బడ్జెట్ నిధులు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

కీలక ప్రాజెక్టులకు
పర్యాటక భూములు

- హబ్ పరిధిలో 427 ఎకరాలున్నట్లు గుర్తించిన పర్యాటక శాఖ
- రెవెన్యూ శాఖ పరిధిలో వందల ఎకరాలు బదలాయింపు పెండింగ్
- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సులో ఒప్పందాలు
- పెండింగ్ భూముల వివరాల నివేదిక సిద్ధం చేసిన పర్యాటక శాఖ
- డీపీఆర్‌ల ప్రకారం ఎంవోయూ సంస్థలకు భూ కేటాయింపులకు ప్రణాళికలు





సాక్షి, విశాఖపట్నం : సహజ అందాలతో అలరారే ఉత్తరాంధ్ర పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కేందుకు సరికొత్త ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఒకవైపు సాగర సోయగాలు.. మరోవైపు ఎత్తైన తూర్పు కనుమల అందాలు ప్రపంచ పర్యాటకులను కట్టిపడేస్తుండగా.. ప్రపంచ పర్యాటక పటంలో టూరిజం రాజధానిగా భాసిల్లే విధంగా ప్రాజెక్టులకు ఇటీవల విశాఖ వేదికగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందుకు అవసరమైన భూములను ఆయా ప్రాజెక్టులకు అప్పగించేందుకు టూరిజం శాఖ కసరత్తు ప్రారంభించింది. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న పర్యాటక భూముల పరిధిని విశాఖ హబ్‌గా ఏర్పాటు చేస్తూ.. ఆయా ప్రాజెక్టుల డీపీఆర్‌లకు అనుగుణంగా భూ కేటాయింపులు చేసేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా జిల్లాలో ఉన్న అపార అవకాశాలను మెరుగు పరుచుకొని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులకు రూపకల్పన జరుగుతోంది. విశాఖ జిల్లానూ పర్యాటక ఖిల్లాగా మార్చే దిశగా.. టూరిజం ప్రాజెక్టులకు కసరత్తు చేస్తున్నారు. మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో జరిగిన పర్యాటక ఒప్పందాల్లో సింహభాగం ఇన్వెస్టర్లు విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలను ఎంపిక చేసుకున్నారు. ఉమ్మడి విశాఖతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. జీఐఎస్‌లో పర్యాటక రంగానికి సంబంధించి రూ.8,806 కోట్లతో 64 ప్రాజెక్టులు ఉత్తరాంధ్రకు రానున్నాయి.

భూ బదలాయింపు ప్రక్రియ షురూ

విశాఖ హబ్ పరిధిలో 39 పార్శిళ్లలో 427.08 ఎకరాలున్నట్లుగా గుర్తించారు. ఇందులో ఎక్కువ మొత్తం భూములు ఇంకా బదలాయింపునకు నోచుకోలేదు. ఈ ప్రక్రియను టూరిజం శాఖ ప్రారంభించింది. ఆయా జిల్లాల కలెక్టర్లకు రెవెన్యూ పరిధిలో ఉన్న పర్యాటక భూముల బదలాయింపు వేగవంతం చేయాలని టూరిజం అధికారులు లేఖలు రాశారు. ప్రస్తుతం వీటికి సంబంధించిన ఫైల్స్ ఆయా మండల తహశీల్దారుల పరిధిలో ఉన్నాయి. వీటిని త్వరగా క్లియర్ చేయాలంటూ కలెక్టర్లు ఆదేశాలు జారీ చేయనున్నారు. భూ బదలాయింపు ప్రక్రియ పూర్తయ్యేలోపు.. ఎంవోయూలు చేసుకున్న పెట్టుబడిదారుల నుంచి కూడా ఫైల్స్ కదిలేలా చేస్తున్నారు. ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌తో పాటు ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్(పీఎంయూ) కూడా అందించాలంటూ ఎంవోయూలు చేసుకున్న సంస్థలకు పర్యాటక శాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ డీపీఆర్, పీఎంయూలు అందితే.. మరోవైపు బదలాయింపు ప్రక్రియ పూర్తయితే.. ఏ ప్రాజెక్టుకు ఏ ల్యాండ్ అవసరమవుతుందనే దానిపై నిర్ణయించి.. ఆయా సంస్థలకు కేటాయింపులు చేపట్టే ప్రక్రియను ప్రారంభించనున్నారు.

సరిహద్దులు గుర్తింపునకు రోవర్ సర్వే

మరోవైపు.. భూముల బదలాయింపు పూర్తయిన తర్వాత.. పర్యాటక భూముల సరిహద్దులను గుర్తించేందుకు సర్వే నిర్వహించనున్నారు. దీనిపై కలెక్టర్ డా.మల్లికార్జున ఆదేశాల మేరకు విశాఖపట్నం, భీమిలి ఆర్డీవోతో టూరిజం రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి భేటీ అయ్యారు. డ్రోన్ సర్వేకు అనుమతులు లేని కారణంగా రోవర్స్ సర్వే నిర్వహించి హద్దులు గుర్తించనున్నారు. ప్రస్తుతం రోవర్స్ విజయనగరం జిల్లాలో భూహక్కు రీసర్వేలో ఉన్న కారణంగా వారం రోజుల్లో సర్వే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

పర్యాటక భూముల వివరాలివీ...

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలో	296.15 ఎకరాలు
శ్రీకాకుళం జిల్లాలో	32.78 ఎకరాలు
విజయనగరం జిల్లాలో	48.8 ఎకరాలు
పార్వతీపురం మన్యం జిల్లాలో	6.25 ఎకరాలు
అల్లూరి సీతారామరాజు జిల్లాలో	43.1 ఎకరాలు
మొత్తం విశాఖ హబ్ పరిధిలో	427.08 ఎకరాలు







పున్నమి చంద్రుడు కనువిందు చేశాడు. వైశాఖ పున్నమి వేళ విశాఖ నగరవాసులకు నేత్రపర్వంగా దర్శనమిచ్చాడు. శుక్రవారం రాత్రి వినీలాకాశంలో నీలిమేఘాల నడుమ, ఆకుల మాటున, పచ్చని కొమ్మల మధ్య అంతటా తానై నిండుగా దర్శనమిచ్చాడు. ఈ రమణీయ దృశ్యాలను నగర వాసులు ఎంతగానో ఆస్వాదించారు... పరవశించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

స్మార్ట్‌సిటీ పనులు సత్వరం పూర్తి చేయండి

దాబాగార్డెన్స్: విశాఖ మహానగరంలో జీవీఎంసీ చేపట్టిన స్మార్ట్‌సిటీ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సాయికాంత్ వర్మ స్మార్ట్‌సిటీ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు పనుల్లో భాగంగా శుక్రవారం పోర్టు గెస్ట్ హౌస్ సమీపాన అభివృద్ధి పరచిన రోడ్లు, ఫుట్‌పాత్‌లను పరిశీలించారు. అనంతరం దత్ ఐల్యాండ్ జంక్షన్ నుంచి సిరిపురం, పార్కు హోటల్ జంక్షన్ వరకు రోడ్డు పనులు, పరిసరాలు పరిశీలించి త్వరితగతిన మిగిలిన పనులు పూర్తి చేయాలని స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌ను కమిషనర్ ఆదేశించారు. అనంతరం 20వ వార్డు చినవాల్తేర్ స్మార్ట్‌సిటీ స్కూల్ సమీప వీధుల్లో పర్యటించారు. పర్యటనలో ఎస్ఈ వినయ్‌కుమార్, ఈఈ సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చదరంగంలో సత్తా చాటుతున్న హార్థిక్



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో హార్థిక్ (ఫైల్)

విశాఖ స్పోర్ట్స్: చదరంగం పోటీల్లో నగరానికి చెందిన చిన్నారి హార్థిక్ కలిదిండి అండర్–7 కేటగిరీలో సత్తా చాటుతున్నాడు. ఇటీవల ఫిడే రేటింగ్ చెస్ సమాఖ్య విడుదల చేసిన అండర్–7 చిన్నారుల కేటగిరీలో బెస్ట్‌గా నిలిచాడు. క్లాసిక్, రాపిడ్ చదరంగాల్లో తొలి స్థానాల్లో నిలిచిన హార్థిక్ బ్లిజ్‌లోనూ ప్రపంచ 12వ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం సెర్బియాలో జరుగుతున్న చెస్ పోటీల్లో పాల్గొనేందుకు హార్థిక్ సిద్ధమవుతున్నాడు. హార్థిక్ నేషనల్ యంగెస్ట్ ప్లేయర్‌గా మూడున్నరేళ్ల వయసులోనే నేషనల్స్ స్కూల్స్ టోర్నీలో సత్తా చాటి.. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరును లిఖించుకున్నాడు.

పేదింటి ఆడపిల్లలకు పెళ్లికానుక



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి తదితరులు

- వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పంపిణీ
- జిల్లాలో 383 జంటలకు రూ.2.33 కోట్ల కేటాయింపు

సాక్షి, విశాఖపట్నం : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ డా. మల్లికార్జున స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా రెండో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, అధికారులు వీక్షించారు. అనంతరం జిల్లా పరిధిలో లబ్ధిదారులకు కలెక్టర్ డా.మల్లికార్జున, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి చేతుల మీదుగా మెగా చెక్ పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 383 జంటలకు రూ.2,33,55,000 అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైయస్సార్ కల్యాణమస్తు – వైఎస్సార్ షాదీ తోఫాతో పాటు భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు రూ.40 వేలు అందించినట్లు వెల్లడించారు. కులాంతర వివాహాలు చేసుకుంటున్న పిల్లలకు ప్రోత్సాహకంగా గత ప్రభుత్వంతో పోల్చుకుంటే ఈ ప్రభుత్వ హయాంలో నగదు పెంచడం జరిగిందన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే వారు 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించడంతో పాటు బాలికలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు తప్పక నిండి ఉండాలని సూచించారు. అర్హులై కూడా ఇంకా లబ్ధి చేకూరని వారు జూన్ లేదా డిసెంబర్‌లో నమోదు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ అన్ని సామాజిక వర్గాల పేదల సంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కుల, మత, వర్గ, రాజకీయ బేధాలు లేకుండా అన్ని వర్గాల వారికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, నగరాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ రమణమూర్తి, గ్రామవార్డు సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి పూర్ణిమాదేవితో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ టోల్ ఫ్రీ 1800-4250 0009



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ప్రధాన సిటీ ప్లానర్ సురేష్‌కుమార్

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): జీవీఎంసీ పరిధి 8 జోన్లలో అనధికారిక నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ విభాగానికి టోల్ ఫ్రీ నంబర్ 1800 4250 0009కు ఫోన్ చేసి నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫోన్ నంబరు 8187897569కు కూడా పూర్తి వివరాలు(జోరు నంబరు, వార్డు నంబరు, చిరునామా, సమస్య వివరాలు) వాట్సప్ చేస్తే సంబంధిత జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఉన్నతాధికారులకు నివేదించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ప్రధాన సిటీ ప్లానర్ బి.సురేష్‌కుమార్ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జోన్–4 నుంచి రెండు, జోన్–5 నుంచి మూడు, జోన్–6 నుంచి ఒకటి, జోన్–8 నుంచి రెండు ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూపీఆర్ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సింహగిరికి వైశాఖి పౌర్ణమి శోభ

- భక్తులతో కిక్కిరిసిన వరాహ పుష్కరిణి
- విశేషంగా తరలివచ్చిన గరిడి బృందాలు



గరిడి బృందాలతో తరలివచ్చి కీర్తనలు ఆలపిస్తున్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిన వరాహ పుష్కరిణి ప్రాంగణం

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని ఇలవేల్పుగా కొలిచే ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మత్స్యకారులు, గ్రామీణులు, ఒడిశా రాష్ట్రం నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము ఒంటి గంట నుంచే కొండదిగువ వరాహ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారి ప్రతిరూపాలుగా వెంట తీసుకొచ్చిన కోలలకు పూజలు చేశారు. స్వయంగా వండుకుని సహపంక్తి భోజనాలు చేశారు. మెట్లమార్గం ద్వారా సింహగిరికి నడిచి వెళ్లి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. గరిడి వాయిద్యాలతో స్వామిని కీర్తించారు. స్నానాలు చేసేందుకు వేలాదిగా తరలివచ్చిన భక్తులతో వరాహ పుష్కరిణి కళకళలాడింది. సహపంక్తి భోజనాలు చేసే భక్తులతో అడవివరం ప్రాంతంలోని సంత ప్రాంగణం, ప్రియాగార్డెన్స్, హవేలి ప్రాంగణం, పాత అడవివరంలోని మామిడి తోటలు గురు,శుక్రవారాలు కిటకిటలాడాయి. మార్కెట్ కూడలి నుంచి వరాహ పుష్కరిణికి వెళ్లే మార్గం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తులతో కిక్కిరిసింది. పుష్కరిణి వద్ద దేవస్థానం గార్డులు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. మార్కెట్ కూడలి నుంచి వరావ పుష్కరిణి వరకు వాహనాల రాకపోకలను నిషేధించారు. దర్శనానికి వెళ్లిన భక్తులతో సింహగిరి మెట్లమార్గం, క్యూలు కిక్కిరిశాయి. ప్రసాద విక్రయశాల రద్దీగా కనిపించింది. నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, గోపాలపట్నం సీఐ నరసింహారావు ఆధ్వర్యంలో 100 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పాలిసెట్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- జిల్లాలో హాజరుకానున్న 12,519 విద్యార్థులు
- జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి వెల్లడి



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి

మహారాణిపేట: ఈ నెల 10న జరగనున్న పాలిసెట్ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో) ఎస్.శ్రీనివాసమూర్తి ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లోని జాతీయ సమాచార కేంద్రం హాలులో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖలో 28 కేంద్రాల్లో 11,569 మంది, భీమిలిలో 6 పరీక్ష కేంద్రాల్లో 950 మంది విద్యార్థులు పాలీసెట్‌కు హాజరుకానున్నట్టు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. కేంద్రంలోకి 10 గంటల నుంచి విద్యార్థులను అనుమతిస్తామని చెప్పారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లతో తనిఖీలు చేయాలన్నారు. తాగునీరు, ప్రథమ చికిత్స కేంద్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం రాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు అనుగుణంగా ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు డీఆర్‌వో సూచించారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించమన్నారు. విద్యార్థులు బ్లూ లేదా బ్లాక్ పెన్, హెచ్‌బీ పెన్సిల్, ఎరైజర్, హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ఒక గుర్తింపు కార్డు మాత్రమే తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పాలీసెట్ కో–ఆర్డినేటర్ కె.డి.వి.నరసింహారావు, భీమిలి కాలేజీ అసిస్టెంట్ కోఆర్డినేటర్ రాజేశ్వరి, జీవీఎంసీ, వైద్య, విద్య, ఈపీడీసీఎల్, ఆర్టీసీ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

విశాఖ స్పోర్ట్స్: పీఎం పాలెంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ స్టేడియం ప్రాంగణంలో వైఎస్సార్ విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను శుక్రవారం కలెక్టర్ ఎ.మల్లికార్జున పరిశీలించారు. త్వరలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ విగ్రహాన్ని ఆవిష్కరించనున్న నేపథ్యంలో కలెక్టర్ ఏసీఏ ప్రతినిధులతో సమీక్ష చేశారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు నగరంలోని నాలుగు ప్రాంతాల్లో ప్రారంభమయ్యాయి. వైఎస్సార్ స్టేడియంలో శుక్రవారం శిక్షణ శిబిరాన్ని డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి లాంఛనంగా ప్రారంభించగా.. ఏసీఏ కార్యదర్శి గోపినాథ్‌రెడ్డి, వీడీసీఏ నిర్వాహక కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. నెల రోజుల పాటు సాగనున్న ఈ శిబిరాల్లో ఎంపిక చేసిన 250 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. వైఎస్సార్ స్టేడియం బీ గ్రౌండ్‌తో పాటు కోరమాండల్, ఉక్కు, మున్సిపల్ స్టేడియంలలో ఈ శిబిరాలు కొనసాగుతాయి. 10 ఏళ్ల గ్రూప్ నుంచి 16 ఏళ్ల వరకు నాలుగు గ్రూప్‌ల్లో వీరంతా బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అంశాల్లో శిక్షణ పొందనున్నారు. శిబిరం అనంతరం జిల్లా జట్లలో వీరిని ఎంపిక చేస్తామని వీడీసీఏ ఉపాధ్యక్షుడు డీఎస్ వర్మ తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయాల్లో మౌలిక సదుపాయాలు

- రూ.5 లక్షల చొప్పున చెక్కుల అందజేత
- మూడు తహసీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు
- కలెక్టర్ మల్లికార్జున వెల్లడి


తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌కు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సీతమ్మధార: జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ డా.ఎ. మల్లికార్జున తెలిపారు. ఆధునికీకరించిన సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన కార్యాలయంలో గదులను పరిశీలించారు. కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 8 తహసీల్దార్ భవనాల ఆధునికీకరణకు రూ.5 లక్షల చొప్పున అధికారులకు చెక్కులు అందజేశారు. గోపాలపట్నం, మునగాడ, మహారాణిపేటకు సంబంధించి నూతన భవనాల నిర్మాణం కోసం రూ.25 లక్షలు చొప్పున మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన డిజైన్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయాన్ని ఆదర్శంగా తీసుకుని.. మిగిలిన కార్యాలయాలు ఆహ్లాదకర వాతావరణంలో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇక్కడ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. విశాఖ ఆర్డీవో కార్యాలయానికి స్థలం గుర్తించాలన్నారు. గాజువాకలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లను కోరమాండల్ ఇంటర్నేషనల్ సాయంతో, భీమిలిలోని హాస్టళ్లను దివీస్ ల్యాబ్ సాయంతో ఆధునికీకరించినట్లు చెప్పారు. రూ.8 కోట్లతో కేజీహెచ్‌లో రోగుల సహాయకులు వేచి ఉండే గదులను ఆధునికీకరించినట్లు వెల్లడించారు. జేసీ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణం ఉన్నప్పుడే.. సిబ్బంది విధులపై మరింతగా దృష్టి సారిస్తారన్నారు. డీఆర్వో ఎ.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ మండల కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు మరింత చేరువ కావచ్చన్నారు. అనంతరం తహసీల్దార్ ఈర్ల శ్యామ్‌ప్రసాద్‌ను కలెక్టర్, జేసీ సన్మానించారు. ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ఉప కలెక్టర్లు ఎస్.డి.అనిత, రామలక్ష్మి, సత్యపద్మ, డి.ప్రమీలాగాంధీ, కలెక్టరేట్ ఏవో కె.ఈశ్వరరావు, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు త్రినాథ్, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

'దామోదరం' లా వర్సిటీలో ఐపీఆర్ చైర్


సెంటర్ ఫర్ ఐపీఆర్ సభ్యులను అభినందిస్తున్న వీసీ సూర్యప్రకాష్

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మేధో సంపత్తి హక్కుల(ఐపీఆర్) చైర్‌ను ఏర్పాటు చేసేందుకు భారత ప్రభుత్వం, వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్ విభాగం(ఐపీఆర్ కాపీరైట్, డిజైన్ విభాగం) వారు స్కీమ్ ఫర్ పెడగోగి అండ్ రీసెర్చ్ ఇన్ హోలిస్టిక్ ఎడ్యుకేషన్ అండ్ అకాడెమియా(ఎస్పీఆర్ఐహెచ్ఏ) కింద ఈ చైర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ఆచార్య డాక్టర్ సూర్యప్రకాష్.. సెంటర్ ఫర్ ఇంటిలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ చైర్‌పర్సన్ ఆచార్య డాక్టర్ పి. శ్రీసుధ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి. జోగినాయుడులను అభినందించారు. దేశంలో మేధో సంపత్తి హక్కులు, వాటికి సంబంధించిన చట్టాలు ఇప్పటికీ అభివృద్ధి దశలోనే ఉన్నాయని.. ఈ అంశంలో పరిశోధనల కోసం వర్సిటీలోని ఐపీఆర్ సెల్ మరింత కృషి చేయాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య డాక్టర్ మధుసూదనరావు తదితరులు సెంటర్ ఫర్ ఐపీఆర్ సభ్యులను అభినందించారు.

క్యాంపస్ డ్రైవ్ నేడు

సీతంపేట: ప్రిజమ్ డిగ్రీ కళాశాలలో శనివారం హెటిరో ల్యాబ్స్ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. 2019 నుంచి 2022 మధ్య ఉత్తీర్ణులైన బీఎస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ కెమిస్ట్రీ, బీ.ఫార్మసీ విద్యార్థులు, ఫ్రెషర్స్(2023) ఈ డ్రైవ్‌కు హాజరుకావచ్చన్నారు. మరిన్ని వివరాలకు డాక్టర్ కృష్ణారావు(83418 61357)ను సంప్రదించవచ్చు.

ఇద్దరికి కరోనా

మహారాణిపేట: జిల్లాలో శుక్రవారం రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 151 మందికి పరీక్షలు నిర్వహించగా.. వీరిలో ఇద్దరికి కరోనా నిర్ధారణ అయింది. 20 మంది హోం ఐసోలేషన్‌లో, ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు.

జాబ్‌మేళాలో 137 మంది ఎంపిక


మాట్లాడుతూ ఎంప్లాయిమెంట్ అధికారి

కంచరపాలెం: జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సీహెచ్ సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.సుధ(టెక్నికల్) తెలిపారు. డిక్సన్ మ్యానుఫ్యాక్చరింగ్ లిమిటెడ్ తిరుపతి, ల్యాండ్ మార్క్ గ్రూప్, ఆరోవాన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఎక్స్‌ప్రెస్ బీస్, రాక్‌మాన్ ఇండస్ట్రీస్, ఖజానా జ్యువెలరీ, కాన్సెంట్రిక్స్, ఎక్సటిక్ టెస్టింగ్ లిమిటెడ్, ఐనాక్స్, వై.ఎస్.కె ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో 525 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 475 మంది పాల్గొనగా.. 137 మందిని ఎంపిక చేసి నియామక పత్రాలు అందించారు. రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి సి.ఉమాదేవి పాల్గొన్నారు.

ఆనందమానందమాయె..

- సీఎం జగన్ చిత్రపటానికి 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల క్షీరాభిషేకం
- పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని ప్రశంసల జల్లు
- ఉత్తరాంధ్ర పరిధిలో ఏర్పాటైన టీచర్స్ అసోసియేషన్లు

అనకాపల్లి టౌన్: ఎప్పుడో పాతికేళ్ల క్రితం ఉపాధ్యాయులుగా స్థిరపడాల్సినవారు.. కాలం కలిసిరాక నిరుద్యోగులుగా మిగిలిపోయారు.. ఏదో ఒక వృత్తిలో కుదురుకొని డీఎస్సీకి ఎంపికైన విషయం కూడా మరిచిపోయారు.. పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇప్పుడు ఉద్యోగాలు ఇవ్వడంతో ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ కృతజ్ఞత తెలుపుకున్నారు. అనకాపల్లి జిల్లా సీఐటీయూ కార్యాలయంలో 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పి.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకున్నారంటూ ప్రశంసల జల్లు కురిపించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి 1998 డీఎస్సీ ఉద్యోగులంతా హాజరై సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 4,072 మందిని గురువుల స్థానంలో నిలబెట్టిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటామని చెప్పారు.

మేలు మరచిపోలేం..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడిపోయాం. 1998 డీఎస్సీ రాసి చాలచాలనీ జీతాలకు ప్రైవేటు పాఠశాలల్లో పనిచేశాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మా తలరాత మారిపోయింది. ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నానంటే అది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన భిక్షే.

–లాలం గణేశ్వరరావు, నర్సీపట్నం

రుణపడి ఉంటాం..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతోనే మాకు ఎంటీఎస్ ఉద్యోగాలు వచ్చాయి. 25 ఏళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత మాకు ఉపాధ్యాయ ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. మా కుటుంబంలో వెలుగులు నింపిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటా.

–పి.అప్పలరాజు, భీమిలి

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

అధికారులను హెచ్చరించిన జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా.. భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం స్పందన, రీ సర్వే, మ్యుటేషన్లు, భూ సేకరణ, యూఎల్‌సీ భూములు తదితర రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. భూ హక్కు పత్రాల బదిలీ, మ్యుటేషన్ సరిదిద్దడం వంటి చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి ప్రజలు ఇంత దూరం వస్తున్నారంటే.. మండల స్థాయిలో తహసీల్దార్లు సరిగ్గా పని చేయడం లేదని అర్థమవుతోందన్నారు. స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కరించి.. ఈ సంఖ్య పూర్తిగా తగ్గించాలని ఆయన స్పష్టం చేశారు. టూరిజం ప్రాజెక్టులకు భూమి సమస్యలు లేకుండా తగిన చర్య లు చేపట్టాలన్నారు. జీవో నంబర్ 388, 301 ద్వారా పట్టాలు పొందిన లబ్ధిదారులు.. ప్రస్తుతం ప్రభుత్వం కల్పించిన రిజిస్ట్రేషన్, పట్టాల్లో మార్పులు, చేర్పుల అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ విషయంలో తహసీల్దార్లు చొరవ చూపాలన్నారు. స్పందన అర్జీల పట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మోచా తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఆర్వో ఎస్.శ్రీనివాస్‌మూర్తి, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, ఏడీ సర్వే విజయకుమార్, ఎస్డీసీలు పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య!


సతీష్ మృతదేహం

పెదగంట్యాడ: మండలంలోని నెల్లిముక్కకు చెందిన ఓ వ్యక్తి మనస్తాపంతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. దాచేపల్లి సతీష్(27) చినగంట్యాడలోని మోర్ సూపర్ మార్కెట్‌లో పని చేస్తున్నాడు. ఏడాది కిందట తునికి చెందిన భవానితో వివాహమైంది. తల్లిదండ్రులతో కలసి సీతానగరంలో నివాసం ఉండేవారు. నెల రోజుల కిందట న్యూపోర్టు పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ దుకాణాన్ని అద్దెకు తీసుకుని పాన్ షాపు నిర్వహిస్తున్నాడు. 10 రోజుల కిందట నెల్లిముక్కులో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని భార్యాభర్తలు ఉంటున్నారు. ఈ నెల 4న సాయంత్రం దుకాణం వద్ద భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో అతను షాపు తెరిచాడు. అతని భార్య కూరగాయల కోసం 7.30గంటల సమయంలో మార్కెట్‌కు వెళ్లింది. మార్కెట్ నుంచి వచ్చిన ఆమెను ఇంటికెళ్లి వంట చేయమని చెప్పాడు. నీరసంగా ఉందని ఆమె చెప్పడంతో షాపులోనే ఉంచి అతను ఇంటికెళ్లిపోయాడు. ఉదయం 8.45 గంటల సమయంలో ఆమె అతనికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో 10 గంటల సమయంలో ఇంటికెళ్లి చూడగా ఫ్యాన్ హుక్‌కు చీరతో ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికులతో కలసి ఆమె తలుపులు విరగ్గొట్టించి లోపలకెళ్లి చూడగా అప్పటికే అతను మృతి చెందాడు. వెంటనే న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రవికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె


తండ్రి అంతిమయాత్రలో పాల్గొన్న కుసుమ

తగరపువలస: జీవీఎంసీ మూడో వార్డు తిలక్ రోడ్డు యాతవీధికి చెందిన చెల్లిబోయిన రాజారావు గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ప్రైవేట్ హోటల్‌లో క్యాషియర్‌గా విధులు నిర్వర్తించే ఆయనకు భార్య వెంకటలక్ష్మి, కుమార్తె కుసుమ తప్ప దగ్గర బంధువులు లేరు. దీంతో బీచ్‌రోడ్డులోని శ్మశానవాటికలో శుక్రవారం తండ్రి చితికి కుసుమ తలకొరివి పెట్టి తన బాధ్యతను నెరవేర్చింది. జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ ద్వారా కుసుమ ఇటీవల శిక్షణ పూర్తి చేసుకుని డీఎస్సీ కోసం ఎదురుచూస్తోంది. మధ్యతరగతి కుటుంబానికి చెందిన రాజారావు తన కష్టం మీదే ఇప్పటి వరకు కుటుంబాన్ని నెట్టుకొస్తూ కుమార్తెను చదివించాడు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తూ చివరకు అంత్యక్రియలు కూడా సరిగ్గా నిర్వహించని కుమారులున్న ఈ కాలంలో.. 20 ఏళ్ల కుమార్తె తండ్రి రుణం తీర్చుకుందని పలువురు అభిప్రాయపడ్డారు.

మలబార్‌లో బ్రైడల్ జ్యువెలరీ కలెక్షన్


పలు డిజైన్లతో మహిళామణులు

సీతమ్మధార: దేశంలోనే అతి పెద్ద బంగారు, వజ్రాభరణాల రిటైల్ వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్, డైమండ్స్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన 'బ్రైడ్స్ ఆఫ్ ఇండియా' 10వ ఎడిషన్ విడుదలైంది. ఈ మేరకు ఆశీలమెట్టలోని మలబార్ షోరూంలో బ్రైడల్ జ్యువెలరీ కలెక్షన్‌ను శుక్రవారం ప్రారంభించారు. అంబాసిడర్లు అలియాభట్, అనిల్ కపూర్‌లతో పాటు దేశంలోనే పలువురు వధువులతో చిత్రీకరించిన థీమ్ సాంగ్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మలబార్ గ్రూప్ మార్కెటింగ్ ప్రతినిధులు సునీత, సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ బ్రైడ్స్ ఆఫ్ ఇండియా క్యాంపెయిన్ ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిందన్నారు. వినియోగదారులు ఖర్చు పెట్టే ప్రతి పైసాకు నాణ్యమైన ఆభరణాలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మోడల్ రచన ఆభరణాలను ధరించి ర్యాంప్ వాక్ చేశారు.

రఘు కళాశాలకు నాక్-ఏ ప్లస్ గుర్తింపు


వివరాలు వెల్లడిస్తున్న చైర్మన్ కలిదిండి రఘు

డాబాగార్డెన్స్: రఘు ఇంజినీరింగ్ కళాశాలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక నాక్ ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపు లభించిందని విద్యా సంస్థల చైర్మన్ కలిదిండి రఘు తెలిపారు. గత నెలలో కళాశాలను సందర్శించిన నాక్ నిపుణుల బృందం రెండు రోజుల పాటు మౌలిక వసతులు, మానవ వనరులు, ప్రయోగశాలలు వంటివి పరిశీలించిందన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఇప్పటికే రఘు ఇంజినీరింగ్ కళాశాల అటానమస్, ఎన్‌బీఏ గుర్తింపు ఉందన్నారు. తాజాగా నాక్ ఏ ప్లస్ గ్రేడ్ గుర్తింపుతో కళాశాలలో అత్యుత్తమంగా ప్రమాణాలు ఉన్నట్లు స్పష్టమైందన్నారు. నాక్ 4.0 స్కేల్‌పై 3.35 మార్కులు పొంది ఏ ప్లస్ గ్రేడ్ సాధించామన్నారు. విద్యార్థులకు అత్యుత్తమ నిపుణులతో బోధన, అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక వసతులు, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విజయ్‌కుమార్, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ పి.శశికిరణ్ పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.62,400
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.57,200
వెండి(కిలో):	రూ.83,700

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)


బ్రాయిలర్ (లైవ్)	: రూ.145
స్కిన్	: రూ.260
స్కిన్‌లెస్	: రూ.270

అప్పన్నకు శాస్త్రోక్తంగా చందనం సమర్పణ


స్వామికి పంచకలశ స్నపనం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శుక్రవారం రెండో విడత చందనం సమర్పణ శాస్త్రోక్తంగా జరిగింది. తెల్లవారుజామున రెండు గంటలకు స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి విశేషంగా పూజలు నిర్వహించారు. అనంతరం మూడు మణుగుల చందనాన్ని స్వామికి సమర్పించారు. ఆలయ ఆస్థాన మండపంలో స్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఉదయం 6.30 గంటలకు అధిష్టింపజేశారు. గంగధారల జలాలు, పంచామృతాలతో స్నపనం నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు గిరి, పవన్‌కుమార్ ఈ కార్యక్రమాలను చేపట్టారు.

హెచ్‌సీజీలో మహిళలకు ఉచిత మమోగ్రఫీ పరీక్షలు


క్యాన్సర్ విజేతలతో హెచ్‌సీజీ వైద్యులు, అతిథులు

ఆరిలోవ: మహిళలు ఎక్కువగా క్యాన్సర్‌కు గురవుతున్నారని.. అందుకే 40 ఏళ్లు దాటిన మహిళలకు ఆరు నెలల పాటు ఉచితంగా మమోగ్రఫీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హెల్త్‌సిటీలోని హెచ్‌సీజీ ఆస్పత్రి సీఈవో ఆదిత్య కౌర్ ప్రకటించారు. హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రిలో శుక్రవారం క్యాన్సర్ విజేతల సత్కార కార్యక్రమం జరిగింది. ఇక్కడ వైద్యం పొంది వ్యాధి నుంచి బయటపడిన వృద్ధులు, యువకులు, పిల్లలను ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ స్పెషల్ సెక్రటరీ టి.ఎస్.ఎన్.మూర్తి, అనకాపల్లి డీఎస్పీ మల్ల మహేష్, ఏసీపీ చుక్క శ్రీనివాసరావు సత్కరించారు. వైద్యులను అభినందించారు. ఈ సందర్భంగా సీఈవో ఆదిత్య మాట్లాడుతూ మహిళలు ఎక్కువగా బ్రెస్ట్ క్యాన్సర్‌కు గురవుతున్నారని, వారు ముందుగానే వైద్య పరీక్షలు చేయించుకుంటే మేలు జరుగుతుందన్నారు. అందుకే 40 ఏళ్లు దాటిన మహిళలకు ఉచితంగా మమోగ్రఫీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రూ.27.62 లక్షల ఆస్తి పన్ను చెల్లించిన మెడ్‌టెక్ జోన్


ఆస్తిపన్ను చెక్కును జెడ్సీకి అందజేస్తున్న మెడ్‌టెక్ జోన్ అధికారులు

గాజువాక: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.27,62,866 ఆస్తి పన్నును ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ అధికారులు శుక్రవారం జీవీఎంసీకి చెల్లించారు. రెవెన్యూ అధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో మెడ్‌టెక్ జోన్ అధికారులు ఈ మొత్తం చెక్కును జోనల్ కమిషనర్ పి.సింహాచలంకు అందజేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఐదు శాతం డిస్కౌంట్‌తో ఈ పన్నును మెడ్‌టెక్ జోన్ అధికారులు చెల్లించారని జెడ్సీ తెలిపారు.